క్లుప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ, నవయువ సమాఖ్య సభ్యులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న మారణకాండకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనా దేశ ప్రజలకు సంఘీభావంగా గుంటూరులో ఈ నెల 12వ తేదీన చేపట్టనున్న రాష్ట్ర స్థాయి సభను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.గౌతమి, నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎం.అప్పలరాజు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ నగర్ కాలనీ ఆటోస్టాండ్ వద్ద ఆ కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.గిరిప్రసాద్, దిలీప్‌కుమార్, కె.శ్రీను, జి.నాగరాజు, కె.భాస్కర్, బి.రాఘువ, ఎస్.కె.రహీమాన్, బి.శేఖర్, వి.ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం



అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల: స్థానిక పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, క్యాంటీన్‌లో రూ.5కే అందుబాటులో ఉండే టిఫిన్, భోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిఫిన్ కింద ఇడ్లీ, పూరీ, ఉప్మా, పొంగల్ వంటివి ఇస్తారని, మధ్యాహ్నం, రాత్రి భోజనం కింద అన్నం, కూర, పచ్చడి, సాంబారు, పెరుగు ఇస్తారన్నారు. వారంలో ఓ రోజు స్పెషల్ రైస్ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, నగర పంచాయతీ కమిషనర్ అప్పలరాజు, ఎంపీడీవో రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



అర్జున్‌మహేశ్వరరావును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

గంట్యాడ: మండలంలోని బుడతనాపల్లి గ్రామానికి చెందిన రంధి అర్జున్‌మహేశ్వరరావు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన్ని విజయనగరానికి చెందినఎంఆర్ యునై టెడ్ వాకర్స్ క్లబ్ వారు బుడతనాపల్లిలో ఆదివారం సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలీ, ప్రతినిధులు సుధాకర్, ప్రసాద్, జాడే భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

దంత, నేత్రవైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డెంటిస్ట్ సుధారాణి

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామంలో గజపతినగరం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర, వైద్య శిబిరాలు నిర్వహించారు. విజయనగరానికి చెందిన వెంకటరామ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ విష్ణువర్ధన్, వెంకటసుధ డెంటల్ హాస్పిటల్ డెంటిస్ట్ లెంక సుధారాణి సుమారు 200 మందికి నేత్ర, దంత పరీక్షలు చేశారని పీఎంపీ అసోసియేషన్ ఇన్‌చార్జ్ ఎల్.స్వామినాయుడు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పీఎంపీలు రెడ్డి అప్పలనాయు డు,పొట్నూరు పైడిరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు

వేపాడ: మండలంలోని కొత్త శింగరాయి గ్రామ సమీపంలో ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని వల్లంపూడి ఎస్‌ఐ దేవి తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది కలిసి దాడి చేశామని చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక సెల్‌ఫోన్ కోడి పుంజు, కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది సూరిబాబు, సింహాచలంనాయుడు, సత్యం, కనకరాజు, రాజు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

బొబ్బిలి: మండలంలోని పెంట, కొత్త పెంట గ్రామాల మధ్య ఓ చోట గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.6,540 నగదు స్వాధీ నం చేసుకున్నారు.

పంటల బీమా.. లేదిక ధీమా!

పంటల బీమా పథకం అమలులోనూ కూటమి సర్కార్ రైతులను దగా చేస్తోంది. ఉచిత పంటల బీమా పథకానికి ఏకంగా మంగళం పాడేసి, అన్నదాత నడ్డి విరుస్తోంది. ప్రస్తుతం పండిస్తున్న పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం చేసిన ప్రకటనతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలప్పుడు ఇస్తానన్న పెట్టుబడి సాయం ఇవ్వకుండా మళ్లీ అదనంగా పంటల బీమా భారం ఏమిటని చంద్రబాబు ప్రభుత్వ తీరును విమర్శిస్తున్నారు. మళ్లీ చీకటి రోజులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పూసపాటిరేగలో ఇటీవల తుపాను వర్షాలకు తడిచిన వరి పంట

- రైతు నెత్తిన పంటల బీమా భారం
- రైతులే ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం
- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రీమియం చెల్లింపు
- పెట్టుబడి సాయం.. బీమా ధీమా లేక రైతుల అవస్థలు
- ఎన్నికల హామీలు అమలుచేసి ఆదుకోవాలని విజ్ఞప్తి



పూసపాటిరేగలో వరి సాగు

పూసపాటిరేగ: ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం ఇచ్చి ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఆ మాట తప్పింది. ఇచ్చిన ఆ హామీ అమలు చేయకుండానే అదనంగా పంటల బీమా ప్రీమియం భారాన్ని రైతు నెత్తిన మోపింది. ఇదివరకు(వైఎస్సార్ సీపీ హయాంలో) రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లించిన పంటల బీమా ప్రీమియాన్ని ఇప్పుడు రైతులే చెల్లించాలని చంద్రబాబు సర్కారు చెబుతుండడంతో రైతులంతా లబోదిబోమంటున్నారు. వరి పంటకు గాను బీమా ప్రీమియం చెల్లించేందుకు డిసెంబరు 31వ తేదీ ఆఖరు కాగా, పెసర, మినుము, మొక్కజొన్న పంటలకు సంబంధించి బీమా చెల్లించేందుకు డిసెంబరు 15వ తేదీ ఆఖరు కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రైతులు చెల్లించాల్సిన పంటల ప్రీమియం వివరాలు..

పంట	చెల్లించాల్సిన ప్రీమియం
వరి	ఎకరాకు రూ.630
పెసర	ఎకరాకు రూ.300
మినుము	ఎకరాకు రూ.300
మొక్కజొన్న	ఎకరాకు రూ.540

అన్నదాత సుఖీభవ లేనట్టే..

రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం.. ఎన్నికలప్పుడు రైతన్నకు ఏటా అన్నదాత సుఖీభవ పథకం పేరిట చేస్తానన్న రూ.20 వేల ఆర్థికసాయం లేనట్లే కనిపిస్తోంది. ఖరీఫ్ సాగు(వరి) జరిగి, ప్రస్తుతం పంట చేతికి వచ్చేసింది. అయినా ఇంతవరకు పెట్టుబడి సాయం అందివ్వలేదు. దీనికితోడు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని చెబుతోంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అయితే ఏటా ప్రతీ రైతుకు రూ.13,500 పెట్టుబడి సాయం కచ్చితంగా ఖరీఫ్ సాగు నాటికి అందించేది. దీంతో పాటు పంటల బీమా ప్రీమియం కూడా రైతుల తరఫున కట్టేది. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వాల పనితీరును పోల్చి చూసే పరిస్థితికి రైతులు వచ్చారు. జగనన్న పాలనే బాగుండేదని రైతులంతా అనుకుంటుండడం విశేషం. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా తమకు ఏ రకంగానూ న్యాయం చేయలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుపాను వర్షాలకు పంటనష్టం..

పూసపాటిరేగ మండలంలో 8 వేల మంది రైతులు మొత్తం 7,500 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వీరంతా ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఇలా అయితే సాగు చేయడం కష్టమేనని అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఎటువంటి పంటల బీమా ప్రవేశపెట్ట లేదు. దీంతో ఖరీఫ్, రబీ సీజన్‌ల పంటల సాగుకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీనికితోడు ఇటీవల తుపాను వర్షాలకు వరి పంటను కొంతమేర నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల్లో తుపాను వర్షాలకు పంట నష్టం జరిగింది. పంటల బీమా లేకపోవడంతో పాడైన పంటలకు సంబంధించి, ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు రబీ సీజన్ పంటలకు సంబంధించి, రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే పెట్టుబడి సాయం లేక.. ఖరీఫ్ వరి సాగు నష్టపోయి పీకల్లోతు కష్టాల్లో ఉంటే పంటల బీమా ప్రీమియం ఎలా చెల్లించాలని రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి..

రబీ సీజన్ పంటలకు సంబంధించి, గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగానే ఇప్పటి కూటమి ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లించాలి. అధికారంలోకి వచ్చి అర్థ సంవత్సరమైనా అన్నదాతలను ఆదుకోకపోతే ఎలా.. ఇప్పటికైనా రైతులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. పెట్టుబడి సాయం, బీమా ప్రీమియం భరోసా ప్రభుత్వం నుంచే రావాలి.

– ఎల్లంనాయుడు, రైతు, రెల్లివలస

సాయం కోసం ఎదురుచూస్తున్నాం..

రైతులను ఆదుకునేందుకు ఎన్నికల సమయంలో ఇస్తానన్న అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి, పెట్టుబడి సాయం తక్షణమే ఇవ్వాలి. రైతులమంతా అప్పులు చేసి మరీ పంటలు సాగు చేస్తున్నాం. సాగు సాయం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో ఎప్పుడు పడతాయా అని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నాం.

– కోరాడ వెంకటరావు, రైతు, బూడి వీధి, పూసపాటిరేగ

మండల పరిషత్ తీర్మానించిన పనులే చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: గ్రామసభల్లో ఆమోదం పొంది, మండల పరిషత్ తీర్మానం చేసిన పనులనే చేపట్టాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, సచివాలయ కార్యదర్శులతో అత్యవసర సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టం–2005 పక్కాగా అమలు చేయాలన్నారు. చట్టం అమలులో చిత్తశుద్ధి లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను తీర్మానం చేయకుండానే కొంతమంది అధికారులు ఆమోదముద్ర వేశారన్నారు. ఇకపై అలా జరిగితే సంబంధిత అధికారులే బాధ్యులవుతారన్నారు. దీనికి ప్రజాప్రతినిధులంతా ఆమోదం తెలపాలన్నారు. ఇప్పుడు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపిస్తోందని, దీనిపై పంచాయతీరాజ్ ఏఈతో పాటు విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

లక్కవరపుకోట: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో వేదపండితులు ఏ.శ్రీహరి శర్మ ఆధ్వర్యంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని, ప్రతిఒక్కరూ గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్‌ఐలు ప్రసన్నకుమార్, రామగణేష్‌లు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా బాలాజీనగర్ వద్ద విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి యువత, విద్యార్థులు ఎక్కువగా చెడు అలవాట్లకు బానిసలై, తమ భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలన్నారు. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, ఎం.ఆర్.హాస్పిటల్, కళాశాలలు, ప్రధాన కూడళ్లలో డ్రాప్‌బాక్సులు ఏర్పాటు చేశామని, వారానికోసారి వాటిని తనిఖీ చేస్తామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలైతే ఆ డ్రాప్‌బాక్సుల్లో ఉత్తరం రాసి వేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం సంకల్పం పోస్టర్ ఆవిష్కరించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో స్వర్ణపతకం



స్వర్ణ పతకం సాధించిన డీఎం రమేష్

శృంగవరపుకోట: జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్(డీఎం) కె.రమేష్ స్వర్ణ పతకం సాధించారు. ఏఎస్‌ఆర్‌టీయూ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని కైలాసగిరి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ నిర్వ హించారు. ఈస్పోర్ట్స్ మీట్‌లో దేశంలో ఉన్న అన్ని ఆర్టీసీల ఉద్యోగులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో 50 ఏళ్ల లోపు ఆఫీసర్లకు 7వ తేదీన 1,000 మీటర్ల ఫాస్ట్ వాకింగ్ పోటీలు నిర్వహించగా స్థానిక ఆర్టీసీ డీఎం రమేష్ ప్రథమ స్థానంలో నిలిచారు. స్వర్ణ పతకం సాధించిన డీఎంను ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు ఆదివారం అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్త కార్యవర్గ సభ్యులు వీరే..

విజయనగరం ఫోర్ట్: ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. విశాఖపట్నంలోని ఓ ప్రై వేటు హోటల్‌లో జరిగిన ఈ ఎన్నికలో ప్రెసిడెంట్‌గా కె.సత్యప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా జి.ఎస్.ఎస్.పట్నాయక్, జాయింట్ సెక్రటరీగా జి.ఎస్.ఎస్.ప్రసాద్, జాయింట్ సెక్రటరీ–2గా జి.వీర్రా జు, జాయింట్ సెక్రటరీ–3గా టి.రాజీకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.శ్రీను, ఆర్గనైజింగ్ సెక్ర టరీ–2గా బి.రఘు, ఆఫీస్ సెక్రటరీగా బి.శాస్త్రి, ఫైనాన్స్ సెక్రటరీగా వి.త్రినాథ్, బిల్డింగ్ సెక్రటరీగా గురుప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దోమల నివారణకు 'ఫాగింగ్'



విజయనగరం వీధుల్లో ఫాగింగ్ చర్యలు చేపడుతున్న దృశ్యం

విజయనగరం: నగరంలో ఆదివారం ఫాగింగ్ చర్యలు చేపట్టారు. నగర కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు తీసుకోవడం జరుగుతోందని, మరోవైపు యాంటీ లార్వా ఆపరేషన్ కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. నగరవాసులు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి దోమలు వృద్ధి చెందకుండా చూడాలని కోరారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని, మురుగునీరు, అనవసర నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీరు ఎక్కువ కాలం నిల్వ ఉన్న ప్రదేశాల్లోనే దోమలు ఎక్కువగా పెరుగుతాయని, వాటి ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ దోమల నివారణకు కృషి చేయాలని కోరారు.

సమయం.. పెట్టుబడి ఆదా

- యంత్రాలతో వరి కోతలు, నూర్పులు



గంట్యాడ మండలం సిరిపురంలో యంత్రం ద్వారా వరి కోతలు చేయిస్తున్న రైతులు

గంట్యాడ: వ్యవసాయం రంగంలో వస్తున్న నూతన మార్పులు, యాంత్రీకరణ వల్ల అన్నదాతలకు అన్ని విధాలా మేలు జరుగుతోంది. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాలపై ఎక్కువగా ఆధారపడు తున్నారు. ముఖ్యంగా వరి కోతలు, మోత, నూర్పులు చేయడానికి రైతులు కూలీల కోసం అధిక మొత్తంలో వెచ్చిం చాల్సి వస్తోంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి కోతలు ముమ్మరంగా సాగు తున్నాయి. కూలీల కొరతతో రైతులు వరికోత, నూర్పులకు యంత్రాలను వినియోగిస్తున్నారు. సాధారణంగా తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎక్కువగా యంత్రాల ద్వారానే వరి కోతలు, నూర్పులు చేస్తుంటారు. అయితే ఈఏడాది జిల్లాలో కూడా పలువురు రైతులు యంత్రాల ద్వారా కోతలు, నూర్పులు చేయిస్తున్నారు.



నూర్పు చేసి నేరుగా ట్రాక్టర్‌లోకి ధాన్యం వేస్తున్న యంత్రం

కూలీల ఖర్చు రూ.18 వేలు

ఎకరా పొలంలో వరి కోతలు చేయడానికి మహిళా కూలీలు రూ.6 వేలు అడుగుతున్నారు. కొంతమంది అయితే రూ.7వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. కూలితో పాటు వారి భోజనాలకు కలిపి రూ.8 వేల వరకు ఖర్చవుతోంది. ఇంకా చేను మోతలు, కుప్పలు పెట్టడం, నూర్పులు, ధాన్యం గాలిపోత, ఇతర పనులకు మరో రూ.10వేల వరకు ఖర్చవుతోంది. ఏకంగా ఎకరానికి రూ.18 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. యంత్రం ద్వారా రూ.3,500 ఖర్చుతో ధాన్యం ఇంటికి యంత్రాలతో వరి కోతలు, నూర్పులు చేయడం వల్ల రైతులకు ఖర్చులు గణనీయంగా తగ్గుతున్నాయి. యంత్రం ద్వారా కోతలు, నూర్పులు చేసేం దుకు ఎకరానికి రూ.3,500 అయితే సరిపోతున్నాయి. కూలీలతో కోతలు, నూర్పులు చేయించడం కంటే అవే పనులు యంత్రాలతో చేయించడం వల్ల రైతులకు రూ.14,500 వరకు మిగులుతోంది. నాలుగు ఎకరాలున్న రైతులకు అయితే రూ.58 వేల వరకు ఆదా అవుతుంది. దీంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు.

రూ.45 వేలు ఆదా



నాకు సొంత పొలం రెండు ఎకరాలు ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎకరానికి వరికోత కోయడానికి మహిళా కూలీలు రూ.6 వేలు అడిగారు. దీంతో యంత్రం సహాయంతో మూడు ఎకరాల్లో కోత కోయించాను. వెంటనే అదే యంత్రంతో నూర్పిడి కూడా అయిపోయింది. మూడు ఎకరాలకు రూ.10,500 ఖర్చు అయింది. ఇదే పనులను కూలీలతో చేయిస్తే రూ.54 వేల వరకు ఖర్చు అయ్యి ఉండేది. యంత్రం ద్వారా కోతలు, నూర్పు చేయడం ద్వారా రూ.45 వేలు ఆదా అయ్యింది.

– కరక నాయుడు ,రైతు , పెదవేమలి

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులు పుస్తక పఠనం చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో లైబ్రేరియన్ పుస్తక పఠనం చేయించారు. ఆ తర్వాత విద్యార్థులతో వివిధ రకాల ఆటలు ఆడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, పుస్తకాలు చదివితే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందన్నారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. గ్రంథాలయానికి రోజూ వచ్చి వార్తా పత్రికలు, నీతి కథల పుస్తకాలు, మిగతా కాంపిటేటివ్ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు.

సన్మానం

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. బొబ్బిలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి కల్యాణచక్రవర్తి, పార్వతీపురం జిల్లా అదనపు న్యా యమూర్తి ఎస్.దామోదరరావు, బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, బార్ అసోసియేషన్ సభ్యులంతా ఆయనను దుశ్శాలువాలతో సన్మానించారు.